# ప్రభాత సమాచారం

ఆదిలాబాద్ Digital Edition

https: epaper.prabhathasamacharam.com

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం | 24 మార్చి 2026 | ■ 12 పేజీలు




2

## సీఎం కప్‌లో ఆదిలాబాద్ 'ఢంకా'

■ రాష్ట్రస్థాయిలో ఓవరాల్ ఛాంపియన్ ■ 82 పాయింట్లతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం కైవసం
■ క్రీడాకారులకు కలెక్టర్ రాజర్షి షా అభినందనలు ■ గ్రామీణ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అద్భుత ప్రతిభ
■ కలెక్టరేట్‌లో సంబరాలు ■ క్రీడా స్ఫూర్తిని చాటిన ఆదిలాబాద్ యువత



నీటి కోసం వ్యవసాయ బావి వద్ద భగీరథ యత్నం..

రూ.కోట్లు ఖర్చు చేసినా అందని తాగునీరు..

# 'జల' ఘోష

- ఎండుతున్న పల్లెగొంతు..
- నీటి కోసం మైళ్ల దూరం నడక
- మేజర్ మండలాల్లో మంచినీటి కొరత
- భూమిలోకి కురుకుపోయిన బోర్లు..
- భగభగలకు మోడువారుతున్న అడవులు
- ఎండవేడిమికి తల్లడిల్లుతున్న జనం
- ఊరూరా తీవ్రమైన మంచినీటి ఎద్దటి
- 'భగీరథ' నీటి కోసం ఎదురుచూపులు
- చుట్టుముడుతున్న వ్యాధులు..
- చోద్యం చూస్తున్న అధికారయంత్రాంగం

అధికారులూ.. మేల్కోండి..!

11

"అడవుల జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.. సూర్యప్రతాపానికి అడవుల జిల్లాలో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు.. ఎండల దాటికి అడవులు మోడువారుతున్నాయి. దీంతో వన్యప్రాణులు విలవిలాడుతున్నాయి.. మరో పక్క తడారి పల్లెగొంతులు చుక్కనీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. పాలకులు ఎందరు మారినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. మంచినీటి పథకాల కోసం ఎన్ని కోట్లు వెచ్చించినా సామాన్యుడికి గుక్కెడు నీళ్లు అందడం లేదు. మరో పక్క మండుతున్న ఎండల కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకీ అడుగంటిపోతున్నాయి.. తాగునీటి బోర్లలో నీరు ఇంకిపోతోంది.. ఈ గండం నుంచి ప్రజలను గట్టెక్కించడానికి ప్రభుత్వం రూ.కోట్లు కుమ్మరిస్తోంది... అయినా ఆ నిధులు సద్వినియోగం కాకపోవడంతో సామాన్య జనానికి జలఘోష తప్పడం లేదు.. జనానికి గుక్కెడు మంచినీరు దొరకడం గగనమవుతుంది. ప్రభుత్వం తాగునీటి సరఫరా కోసం వెచ్చిస్తున్న కోట్లాది రూపాయలు సద్వినియోగం కావడం లేదు.. దీంతో సామాన్య ప్రజలు నీటిని కూడా కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది."

-ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి



చెలిమెల నీరే శరణ్యం..



12

## బాసర ట్రిపుల్ ఐటీపై మంత్రి జూపల్లి సీరియస్

- విద్యార్థుల ఆందోళనలు, సెలవుల ప్రకటనపై హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష.
- సమస్యల పరిష్కారానికి ఆదేశం ■ ఆవేశంతో భవిష్యత్తును పాడుచేసుకోవద్దు
- విద్యార్థులకు హితవు ■ క్యాంపస్‌లో మౌలిక వసతుల కల్పనలో రాజీ ప్రసక్తే లేదు
- ట్రిపుల్ ఐటీకి వస్తా.. ■ విద్యార్థులతో ముఖాముఖి చర్చలు జరుపుతానన్న మంత్రి

బాసర ట్రిపుల్ ఐటీలో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల నిరసనలు, తదనంతరం సెలవులు ప్రకటించడం, తదితర అంశాలపై జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్యాంపస్‌లో ప్రస్తుత స్థితిగతులను, విద్యార్థుల ఆందోళనల వెనుక ఉన్న కారణాలను ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్ మంత్రికి వివరించారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా సెలవులు ప్రకటించాల్సి వచ్చిందని వీసీ గోవర్ధన్ మంత్రికి తెలిపారు.

ఐటీడీఏలో

## 'డిజిటల్' విప్లవం

ఫిర్యాదుల పరిష్కారానికి 'ఐటీడీఏ పల్స్'

గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచే లక్ష్యంతో ఉట్నూరు ఐటీడీఏ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు, వేగంగా పరిష్కరించేందుకు వీలుగా ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేశారు. 'ఐటీడీఏ పల్స్' పేరుతో రూపొందించిన ఈ నూతన ప్లాట్‌ఫామ్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ సోమవారం ప్రారంభించారు.



## ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం



10

- మానవ హక్కుల కమిషన్ చైర్మన్ షమీమ్
- జన్నారంలో గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ..
- విద్యార్థులతో ముఖాముఖి..
- వైద్యులు సమయపాలన పాటించాలి
- రోగులకు మెరుగైన సేవలు అందించాలి
- వెదురు ఉత్పత్తుల కేంద్రం సందర్శన..

ఆదివాసీ గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి, వారి ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్పష్టం చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రి, వెదురు ఉత్పత్తి కేంద్రాలను సందర్శించి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేవలం విద్యా బోధనే కాకుండా విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు, పౌష్టికాహారం రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.



## సిరాజ్ ఖాద్రి ఇక లేరు..!

అనారోగ్యంతో కన్ను మూసిన ఎంఐఎం సీనియర్ నేత

ఎంఐఎం సీనియర్ నాయకుడు, సిరాజ్ ఖాద్రి సోమవారం రాత్రి ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో కన్ను మూసారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సుదీర్ఘ కాలం పాటు ఆదిలాబాద్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొన్న సిరాజ్ ఖాద్రి జర్నలిస్టుగా జీవితాన్ని ప్రారంభించి సియాసత్ దినపత్రికలో పని చేసిన ఆయన సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎంఐఎం పార్టీలో చేరారు. 12లో



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశం
- సమీకృత కార్యాలయాల భవనంలో అర్జీల స్వీకరణ
- కుల ధ్రువీకరణ, భూ సమస్యలపై వినతులు..
- నిర్లక్ష్యం వహించకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచన



**మంచిర్యాల, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయి లో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన రాపల్లి పరమేష్ తాను పంబాల (ఎస్. సి.) కులానికి చెందిన వాడను అని, తనకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కులగణన ప్రకారం గ్రూప్ 1 ఎస్. సి. పంబాలగా కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన మునిగంటి భాస్కరాచారి తాను ఆర్ ఒ ఆర్ పాలసీ క్రింద ప్రభుత్వం కేటాయించిన భూమిని సదరు యజమాని వద్ద నుండి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో దస్తావేజు ద్వారా కొనుగోలు చేశానని, తన అవసరాల నిమిత్తం విక్రయిస్తుండగా సదరు భూమి నిషేధిత జాబితాలో ఉందని తెలుపుతూ పెండింగ్ నెంబర్ జారీ చేశారని, తాను ఇట్టి ప్లాటును విక్రయించేందుకు ఎన్ ఓ సి జారీ చేయగలరని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన తేజ్ ప్రకాష్ అగర్వాల్ తన పట్టా పాస్ పుస్తకంలో సవరణ కొరకు దరఖాస్తు చేసుకున్నానని, సవరణ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్ గ్రామానికి చెందిన నెల్కి వనజ తన తండ్రి పేరిట గల భూమిని తనకు తెలియకుండా పట్టా మార్పిడి చేయకూడదని కోరుతూ అర్జీ సమర్పించారు. మందమర్రి మండల చుట్టుపక్కల గ్రామ రైతులు తాము సన్నరకం వడ్లను కొనుగోలు కేంద్రాలలో విక్రయించామని, బోనస్ డబ్బులను ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండలం సింగాపూర్ గ్రామానికి చెందిన మార్త నారాయణ తన భూమిని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైన్ లో కోల్పోయానని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చెన్నూర్ పట్టడానికి చెందిన బాల లింగయ్య మంచిర్యాల సీనియర్ సివిల్ కోర్టులో కొనసాగుతున్న వ్యవసాయ భూములకు సంబంధించి రైతు బంధు, పంట రుణాలను నిలుపుదల చేసి మంజూరు చేసిన వాటిని రికవరీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏడీసీసీ బ్యాంకులో పొదుపు చేయండి

# అధిక వడ్డీ పొందండి

ఖానాపూర్‌లో 'ధనవర్షిణి' స్కీమ్‌పై అవగాహన

**ఖానాపూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

మా బ్యాంక్‌లో అధిక వడ్డీ ఇస్తున్నాం మా బ్యాంక్‌లో డిపాజిట్ చేయండి అంటూ ఆదిలాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి.ఖానాపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ధనవర్షిణి డిపాజిట్ సేకరణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏడీసీసీ బ్యాంక్ సిబ్బంది ఇంటింటికి వెళ్తూ డిపాజిట్ సేకరణ కార్యక్రమాన్ని నిర్మల్ జిల్లా ఖానాపూర్, సుర్జాపూర్ గ్రామాలో చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీసీసీ బ్యాంక్ ఖానాపూర్ మేనేజర్ కల్పన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ఫిక్స్డ్ డిపాజిట్ పై జనరల్ సిటిజన్ (మగవారు) 8.40%, సీనియర్ సిటిజన్ 8.60% ( మహిళ )తో అధిక వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31 వరకు ఇటువంటి వడ్డీతో ఈ స్కీమ్ ఉంటుందని, రైతులు, వ్యాపారస్తులు, తదితరులు ఈ అవకాశని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు రాజేష్, సంతోష్, సిబంది శ్రీకాంత్, ప్రశాంత్, శైలత, పద్మ, సాగర్, డిపాజిట్ దారులు జంగిలి నర్సయ్య, వెలముల శ్యామ్, అంజి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- కలెక్టరేట్‌లో ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్
- రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశం
- జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా టీకాల పంపిణీ
- పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పిలుపు..



**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించి జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన ప్రచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులందరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించేలా ఈ ప్రచార రథం ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా, రైతులు విధిగా తమ పశువులకు టీకాలను వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, పశువైద్య అధికారి బాలిగ్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు



**నార్నూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

మేకలు రెండు లేదా మూడు పిల్లలకు జన్మనివ్వడం చూస్తూనే ఉంటాం. కానీ ఒక ఆవు రెండు దూడలకు జన్మనిచ్చిన వింత సంఘటన మండలంలోని మాధాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. మాధాపూర్ గ్రామానికి చెందిన కాంబ్లె సుదర్శన్‌కు చెందిన ఆవు సోమవారం రెండు దూడలకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలుసుకుని దూడలను చూసి పరిసర గ్రామస్థులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్య అధికారులను అడగగా ఆవులు రెండు దూడలకు జన్మనివ్వడం అరుదుగా జరుగుతుందని తెలిపారు.



పదో తరగతి పరీక్షలు

# ప్రశాంతంగా సాగాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి
- చైతన్య పాఠశాల కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్
- జిల్లా వ్యాప్తంగా 48 కేంద్రాల ఏర్పాటు
- పటిష్టమైన పోలీస్ బందోబస్తు.
- తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలపై పర్యవేక్షణ

**మంచిర్యాల, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర నిమిత్తం అవసరమైన మందులు, వైద్య సిబ్బంది నియమించడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర స్థాయి రెండో ఎడిషన్ సీఎం కప్‌లో ఆదిలాబాద్ జిల్లా ఘనత



**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రెండో ఎడిషన్ సీఎం కప్ క్రీడా పోటీలలో ఆదిలాబాద్ జిల్లా అద్భుత ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన సందర్భంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్రీడాకారులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ పారామీటర్ల ఆధారంగా నిర్వహించిన ఈ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లా అత్యధికంగా 82 పాయింట్లు సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ చారిత్రాత్మక విజయం సాధించిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 50 మంది క్రీడాకారులు రేపు హైదరాబాద్‌లో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొననున్నారని, జిల్లా సాధించిన ఈ ఘనతపై జిల్లా ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డివైఎస్ఓ శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలకు నెల రోజుల్లోనే పరిష్కారం చూపాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- కలెక్టరేట్‌లో ప్రజల నుండి 93 అర్జీల స్వీకరణ
- అధికారులకు కీలక ఆదేశాలు
- హస్టళ్లలో భోజనం నాణ్యతపై రాజీ పడొద్దు
- బియ్యంలో పురుగులుంటే ఉపేక్షించం
- వారానికి రెండుసార్లు హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలి



**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 93 అర్జీలు రావడం జరిగిందని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందే ఫిర్యాదులను 30 రోజుల్లోపు పరిష్కరించాలని, మండల స్థాయిలో ఎంపిడిఓలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌లను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పదేపదే ఒకే సమస్యపై ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, అప్పీల్ కేసులను రెండు మూడు రోజుల్లోనే పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు అందించే భోజన నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, కొత్త మెనూ ప్రకారం బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ సకాలంలో అందించాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బియ్యంలో పురుగులు వచ్చినట్లైతే సరఫరాదారుల నుంచి సరుకులను తిరిగి పంపించి, నాణ్యమైనవి తెప్పించాలని ఆదేశించారు. పెంచిన రేట్ల ప్రకారం సరుకుల సరఫరా సక్రమంగా ఉండాలని, ప్రత్యేక అధికారులు వారానికి కనీసం రెండుసార్లు హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని స్పష్టం చేశారు. అలాగే, వివిధ ప్రభుత్వ శాఖల పేరుతో ఉన్న మున్సిపల్ ఆస్తి పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని, సంబంధిత హెచ్.ఓ.డి లు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుండి 7 వరకు నిర్వహించే 'ఆరోగ్య వారోత్సవాల'ను విజయవంతం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 'ఫుడ్ సేఫ్టీ మేళాలు' నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పవిత్ర రంజాన్ మాసంలో నిరంతరం సేవలందించినందుకు గాను జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు, సిబ్బందిని అమన్ ఫౌండేషన్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, డిఆర్డీఓ రవీందర్, డివైఎస్ఓ శ్రీనివాస్, డిఏండబ్ల్యూఓ కలీం, డిపిఓ రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఫౌండేషన్ అధ్యక్షుడు అర్ఫాత్ ఖాన్, ఫౌండేషన్ ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## జైనథ్‌లో అద్భుతం
## నరసింహుని పాదాలను తాకిన సూర్యకిరణాలు

- భాస్కరుని కిరణ కాంతుల్లో మెరిసిన మూలవిరాట్టు.. భక్తుల తన్మయత్వం
- ప్రాచీన శిల్పకళా చాతుర్యానికి సజీవ సాక్ష్యం జైనథ్ లక్ష్మీనరసింహ ఆలయం
- సూర్య కిరణాల స్పర్శను వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులు
- పల్లవుల కాలం నాటి నల్లరాతి కట్టడంలో ఆవిష్కృతమైన అద్భుత ఘట్టం

**జైనథ్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

జైనథ్ మండల కేంద్రంలో అతిప్రాచీనమైన ఆలయాల్లో ఒకటిగా ప్రసిద్ధిచెందిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ఈ ఘట్టం కనువిందు చేసింది. స్వామివారి పాదాలను సూర్యకిరణాలు నేరుగా తాకాయి. ఈ విషయం తెలిసి.. ఆ ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు చుట్టుపక్కల భక్తులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పాదాలు, కిరీటంపై సూర్యకిరణాలు పడగా.. ఆ కిరణకాంతుల్లో స్వాములోరి రూపాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

**పల్లవుల కాలంనాటి ఆలయం...**

హైదరాబాద్ నుంచి సుమారు 324 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం అద్భుతమైన శిల్పకళా సంపదను కలిగి ఉంది. ఆలయం జైన సంప్రదాయ పద్ధతిలో ఉండటం వల్లే ఆ ఊరికి జైనథ్ అనే పేరు వచ్చినట్లు చరిత్ర చెప్తోంది. 60 గజాల ఎత్తు, 40 గజాల వైశాల్యంతో అష్టకోణాకార మండపంతో నల్లరాతితో ఆలయాన్ని నిర్మించారు. లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్టుతోపాటు.. లక్ష్మీదేవి, అనంతపద్మనాభ స్వామి, చెన్నకేశవుడు, గధాదరుడు, హక్ష్మీగ్రీవుడు, గరుత్మంతుడు కొలువై ఉంటారు. సంతానం లేనివారు స్వామి వారిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందన్న నమ్మకం ఉంది. ప్రతిఏటా ఫిబ్రవరి, ఏప్రిల్, ఆగస్టు, దసరా తర్వాత వచ్చే ఆశ్వీయుజ పౌర్ణమి నాడు లక్ష్మీనారాయణుని పాదాలను సూర్యకిరణాలు తాకుతాయి. అందుకే స్థానికులు లక్ష్మీ సూర్యనారాయణుడిగా కూడా భక్తులు పిలుచుకుంటారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి



- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్
- శాఖల మధ్య సమన్వయంతో సమస్యలకు మోక్షం కల్పించాలని అధికారులకు ఆదేశం
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి..



**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ వసతి గృహాలు తనికి చేస్తూ ఉండాలని తెలిపారు. వేసవికాలం దృష్ట్యా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా టీకా వేయించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో జిల్లా పశుసంవర్ధక, పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల సంచార వాహనాన్ని జిల్లా పశువైద్య శాఖ అధికారి యాకుబ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాడి రైతుల ఆర్థిక అభివృద్ధి, పశువుల సంక్షేమం దిశగా ప్రభుత్వం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, మార్చి 10వ తేదీ నుండి ఏప్రిల్ 9వ తేదీ వరకు 8వ విడత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాడి పశువులు, మేకలు, గొర్రెలు, పౌల్ట్రీ ఫారాలలో గాలికుంటు వ్యాధి నివారణ దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో పశు వైద్యాధికారులు అందుబాటులో ఉన్నారని, పాడి రైతులు తమ పశువులకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**బేల, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బేల మండల కేంద్రంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వివిధ గ్రామాల నుండి ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని తమ పేర్లను నమోదు చేసి, ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులను తీసుకెళ్లారు. కార్యక్రమానికి ఐ.కె.పి, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖల సిబ్బంది సహకరించారు. ఈ సందర్భంగా స్థానిక పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అవసరం ఉన్న రోగులకు మెరుగైన వైద్యం కోసం రిమ్స్ ఆసుపత్రికి సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు.

## నేడు వేంపల్లి డిపోలో కలప వేలం



**ఆసిఫాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మండలంలోని వేంపల్లి టింబర్ డిపోలో కలప వేలం నిర్వహించనున్నట్లు డీఎఫ్‌వో నీరజ్ కుమార్ తెలిపారు. డివిజన్ ఫారెస్ట్ అధికారి అప్పయ్య పర్యవేక్షణలో మంగళవారం ఉదయం 11 గంటలకు కలప వేలం ఉంటుందని, ఆసక్తి గల వ్యాపారులు, వినియోగదారులు వేలంలో పాల్గొని కలపను వేలం ద్వారా సొంతం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం వేంపల్లి టింబర్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



## అంగన్‌వాడీల్లో అట్టహాసంగా 'సీమంతాల' వేడుక

**జన్నారం, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పలు గ్రామ పంచాయతీల పరిధిలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు అధికారులు శ్రీమంతాలు. పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కన్నవారింటిదగ్గర జరుపుకునేలాగా ఘనంగా శ్రీమంతుల కార్యక్రమాన్ని నిర్వహించడం పట్లగర్భిణీలు సంతోషం వ్యక్తం చేశారు కార్యక్రమంలో సిడిపిఓ రేష్మ ఎంపీడీవో ఉమర్ షరీఫ్ కార్యదర్శి రాహుల్ పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ కిష్టాపూర్ సర్పంచ్ నరేష్ అధికారులు పాల్గొన్నారు.

## మాడిఫైడ్ సైలెన్సర్లను బిగిస్తే కఠిన చర్యలు

**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

శబ్ద కాలుష్యం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లను అక్రమంగా బిగించుకున్న వాహనదారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టి, మాడిఫైడ్ సైలెన్సర్లను ఏర్పాటు చేసిన వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ప్రజల ప్రశాంత వాతావరణం, మానసిక స్థితి, ఆరోగ్యంపై ప్రభావం చూపే వాహనదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఆమె తెలిపారు.



## మధుకర్‌కు పద్మశాలి ఉగాది పురస్కారం

**బెల్లంపల్లి, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలోని కర్నాల బస్తీకి చెందిన హనుమాండ్ల మధుకర్‌కు పద్మశాలి ఉగాది పురస్కారం లభించింది. అమ్మఒడి ఎన్జీవో ద్వారా నిరుపేదల ఆకలి తీరుస్తున్నందుకు గాను ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాదులో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో సినీ హాస్యనటుడు బాబు మోహన్ చేతుల మీదుగా మధుకర్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.



## రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**మందమర్రి, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడు వెంకటస్వామి, ఆయన భార్య సుమలత తీవ్రంగా గాయపడ్డారు. మంచిర్యాల నుంచి ద్విచక్ర వాహనంపై మందమర్రి వైపు వస్తున్న వీరిని, బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ఆలయం సమీపంలోని వంతెనపై వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాలయ్యాయి.

# గృహ వినియోగ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించవద్దు

- జిల్లా వ్యాప్తంగా 8 బృందాలచే ఆకస్మిక తనిఖీలు
- హోటల్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు ఇతర వ్యాపార సంస్థలు వాణిజ్య గ్యాస్ ను ఉపయోగించాలి
- నిబంధనలు ఉల్లంఘించిన వాణిజ్య సముదాయాలపై కేసులు నమోదు చేయబడతాయి
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

జిల్లా వ్యాప్తంగా గృహ వినియోగానికి కేటాయించిన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్న ఘటనలు గమనించబడిన నేపథ్యంలో, అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వాణిజ్య సముదాయాల వద్ద రెండు రోజులుగా అవగాహన కల్పించబడింది అని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఇకనుండి చట్ట విరుద్ధంగా గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్, వాణిజ్యానికి పరంగా ఉపయోగించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రభుత్వం సబ్సిడీతో ప్రజలకు అందిస్తున్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు మరియు ఇతర వ్యాపార సంస్థల్లో వినియోగించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమే కాకుండా, ప్రజల ప్రాణ భద్రతకు కూడా ముప్పు కలిగిస్తాయని తెలిపారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం వల్ల గ్యాస్ లీకేజీ, అగ్ని ప్రమాదాలు వంటి ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. రేపటినుండి జిల్లా వ్యాప్తంగా 8 బృందాలచే తనిఖీలను నిర్వహించడం జరుగుతుందని, నిబంధనలో నించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు. వ్యాపార సముదాయాలు ఇకపై ఎవరైనా గృహ వినియోగ గ్యాస్‌ను అక్రమంగా వాణిజ్య ప్రయోజనాలకు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే, వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో ఇటువంటి అక్రమ వినియోగం గమనించినట్లయితే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాజ భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌కు సన్మానం



**జన్నారం, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధి జన్నారం మండలంలోని ఆదివాసి గిరిజనులకు కల్పిస్తున్న సౌకర్యాలు సమీక్షించడానికి మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తార్ విచ్చేశారు. మంచిర్యాల జిల్లా, జన్నారం మండలంలోని ఆదివాసి, గిరిజనులు, మహేంద్రులు అడవిలో దొరికే వెదురు,తునికాకు, ఇప్పపువ్వు తదితర వాటిపై ఆధారపడినవారు, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు అటవీ, గోదావరి, వాగు, వొర్రెల నుండి మండల ట్రాక్టర్ యజమానులను ఇసుక తరలించే విషయంలో అటవీ అధికారులు వేధించే విషయంలో పలు సమస్యల పరిష్కారానికై, సోమవారం జన్నారం మండల కేంద్రంలోని హరిత హోటల్‌కు విచ్చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ ను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సబ్బండ కులాల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

**24 గంటలు ప్రజారక్షణలో పోలీసు వ్యవస్థ విధుల నిర్వహణ - ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటంలో భాగంగా 24 గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి ఆటంకం కలిగించే వారిపై కఠిన మైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ హెచ్చరించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ పోలీసుల ప్రధాన బాధ్యతగా ఉంటూ, విధుల్లో ఉన్న సిబ్బందిపై దౌర్జన్యానికి పాల్పడడం, విధులను అడ్డుకోవడం వంటి చర్యలు అసలు సహించబోమని స్పష్టం చేశారు. జిల్లాలో ఇటీవల నార్నూర్, ఉట్నూర్, ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధుల్లో చోటుచేసుకున్న మూడు వేర్వేరు ఘటనల్లో పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలకు సంబంధించి మొత్తం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సంబంధిత పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీ



చేసినట్లు చెప్పారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ, పోలీసు సిబ్బందికి సహకరించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తినప్పుడు చట్టబద్ధ మార్గాలను ఆశ్రయించాలని సూచించారు. పోలీసులపై దాడులు, విధులకు అడ్డంకులు కలిగించడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలుగా పరిగణించబడతాయని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటానికి, నేరాలను అరికట్టడానికి పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజల సహకారం పోలీసులకు అత్యంత అవసరమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.



## నరేష్ కుమార్‌కు సన్మానం

**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**


ఆరోగ్య జ్యోతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కే నరేష్ కుమార్‌ను అదిలాబాద్ జిల్లా ఆయుష్ వైద్యుల ఆధ్వర్యంలో సోమవారం నాడు రిమ్స్‌లో గల ఆయుష్ లో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఆయుష్ జిల్లా ఆయుష్ మేనేజర్ డాక్టర్ రాథోడ్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నర్మద, డాక్టర్ అనిత, డాక్టర్ ఇక్రమ్ ఉద్దీన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పెరట్లో గంజాయి సాగు చేస్తున్న నిందితుడి అరెస్ట్

**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

మావల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారంతో ఎస్సై వై. మధుకృష్ణ ఆధ్వర్యంలో కొమరం భీమ్ కాలనీలో తనికి నిర్వహించగా, ఇంటి వెనుక భాగంలో 2 గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.5,000/-గా అంచనా. నిందితుడు గేడం జంగు (39), కూలీగా పనిచేస్తూ, మహారాష్ట్ర నుండి విత్తనాలు తెచ్చుకుని సాగు చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఇతనిపై గతంలో చోరీ కేసులు నమోదైన నేరస్థుడిగా ఉండడం జరిగిందని తెలిపారు. నిందితునిపై మావల పోలీస్ స్టేషన్ నందు క్రైం నెం.188/2026 చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు తరలించారు. మాదక ద్రవ్యాల సాగు, వ్యాపారం సమాజానికి హానికరమని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని మావల ఎస్‌హెచ్‌ఓ రాహుల్ కాంత్ ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కర్రె స్వామి పాల్గొన్నారు.





### కాంగ్రెస్ పార్టీలో చేరిన

## ముగ్గురు సర్పంచులు

**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి, గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలని సూచించారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలం బుర్నూర్, లోహార, లింగుగూడ గ్రామ పంచాయతీల సర్పంచులు ఆత్రం గంగారాం, వసంత్ రావు, మానిక్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

**పెంబి, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

పెంబి మండలంలోని ఆదివాసి గిరిజనగూడాల్లో సమస్యలు పరిష్కరించి మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవకు గిరిజనులు వినతి పత్రం అందించారు. చాలా గ్రామాల్లో రోడ్లు లేవని, విద్యుత్ సౌకర్యం లేదని వాగులపై వంతెనలు నిర్మించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ నూతన కుమార్ తిరుపతి శంభు తదితరులున్నారు.



## డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**మంచిర్యాల, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

కార్పొరేషన్‌లోని 11వ డివి జన్‌లోని శ్రీపాద సిటి, టీఎన్ జీవోస్ కాలనీ, సత్యనారాయణ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని కార్పొరేటర్ సుధ మల్ల హరికృష్ణ అన్నారు. 11వ డివిజన్‌లో సోమవారం ప్రజా పాలన ప్ర గతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌తో కలిసి కాలనీల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసు కున్నారు.



## పేకాట స్థావరంపై దాడి

**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చందా టి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఎస్సై విష్ణువర్ధన్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈ సందర్భంగా గిరికి మహేందర్, సోమ ప్రశాంత్, ముత్తన్న, ఆకాష్, సాయికుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 5 మొబైల్ ఫోన్లు, రూ.40,860 నగదు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

# సమస్యలు తెలుసుకొని.. భరోసా కల్పించి

### అర్జీదారులు స్వీకరించిన కలెక్టర్ హరిత

**ఆసిఫాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థా యిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కె హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సము దాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా వాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై ప్రతికల్లో వచ్చిన ప్రతికూల వార్తలపై అధికారులు వెంటనే స్పందించి చర్య లు తీసుకోవాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన బైసాబేగం ఇందిరమ్మ ఇల్లు



మంజూరు చేయా లని దరఖాస్తు చేసుకున్నారు. ఆసిఫాబాద్ మండలం జెండాగూడకు చెందిన లోకండే పెంటుబాయి తన భర్త మరణించినందున వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని, కెర మెరి మండలం పరందోళి గ్రామానికి చెందిన వైజనాథ్ తాను చేపట్టిన రహదారి మరమ్మత్తు పనులు బిల్లులు చెల్లించాలని దరఖాస్తు చేసు కున్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన షాన్ మహ్మద్ తనకు రావాల్సిన పెన్షన్ నిలుపుదల చేసినందుకు పెన్షన్ ఇప్పించాలని కోరారు. కాగజ్‌నగర్ పట్టణం పోచమ్మ బస్తీకి చెందిన రామన్ తన పట్టా భూమిని భూ కొలతల అధికారితో కొలతలు చేయించాలని దరఖాస్తు అందజేశారు. జైనూరు మండలం గౌరి గ్రామానికి చెంది న మేస్రం శేఖు తనకు వ్యవసాయ బావి మం జూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దుర్గమ్మ తాను సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిని లావుని పట్టా చేయుట గురించి దరఖాస్తు చేసుకున్నారు. కాగజ్‌నగర్ పట్టణం సర్‌సిల్క్ కాలనీకి చెందిన గుండె సమ్మక్క తనకు మంజూరైన ఇందిరమ్మ ఇంటిపై నుంచి విద్యుత్ తీగలు వెళ్తున్నందున సరిచేయాలని దరఖాస్తు చేసు కున్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధి త అధికారులు పాల్గొన్నారు.

# ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోండి



**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

టిఎస్‌ఆర్జెసి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం 10వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సోఫీ నగర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జిల్లా కన్వీనర్ దాని యల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2026 27 విద్యా సంవత్సరం గను ఇంటర్ ప్రవేశాల కోసం టీఎస్‌ఆర్జేసీ గురుకుల సెట్ ప్రవేశ మే 3న నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపీసీ బైపీసీ ఎంఈసిసి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం గురుకుల సెట్ ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్ కోటగిరిలో సీట్లు కేటాయించబడుతుందన్నారు. టీఎస్‌ఆర్జేసీ గురుకుల కళాశాలలో నాణ్యమైన భోజనం, కార్పొరేటర్ స్థాయి విద్య, ఎంసెట్ నీట్ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇతర విభాగాలు ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. మే 3న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు ఆన్లైన్ లో 200 రూపాయలు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

# ఎన్నికల హామీలను అమలు చేయాలి



**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఆంక్షలు లేని జీవన భృతి కల్పించాలని ప్రగతిశీల బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు సోమవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం రోజున తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ టియుసిఐ ఆధ్వర్యంలో జిల్లా పాలన అధికారి కార్యాలయం ముందు ధర్నా చేసి కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం అయినది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.రాజన్న మాట్లాడుతూ... వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధిని కల్పిస్తున్న బీడీ పరిశ్రమ రోజు రోజు క్షీణించి నిర్వీర్య స్థాయికి దిగజారుతుంది. బీడీ పరిశ్రమలో నెలకు 8, 10 రోజుల పని కల్పిస్తున్నారు. రోజు పని దొరకడం లేదన్నారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం.బక్కన్న, ఆర్ రామ లక్ష్మణ్, గంగన్న, కె.లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఫెరోజ్, గంగాధర్, గంగామణి, నారాయణ, సుశీల, గోదావరి, తదితరులు పాల్గొన్నారు.



### గిన్నిస్ రికార్డులో

## లక్షెట్టిపేట వాసులు

**లక్షెట్టిపేట, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీవాసవి మాత పారాయణం గిన్నిస్ బుక్ రికార్డు కార్యక్రమంలో లక్షెట్టిపేట పట్టణానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు. 22 వేల మంది మహిళలతో ఈ గిన్నిస్ రికార్డ్ కార్యక్రమం నిర్వహించగా ఇందులో మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మహిళలు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

## ఆప్ నాయకుల అరెస్టు

**ఖానాపూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యా వైద్యరంగం రైతాంగానికి నిధుల కేటాయింపును నిరసిస్తూ ఆమ్ ఆద్మీ చేపట్టిన ఆందోళనలోనేతలను అరెస్టు చేశారు. అసెంబ్లీ కార్యాలయానికి ముట్టడించనున్నట్లుందుకు రాష్ట్ర నాయకులు రామా, అనసూయతో కలిసి వెళ్తున్న జిల్లా అధ్యక్షులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించినట్లు తెలిపారు.



# భగత్ సింగ్ త్యాగ స్ఫూర్తితో పోరాడాలి



**ఆసిఫాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుడు భగత్ సింగ్ (దీష్ముఖ్ రాజాఅస్తప్త) వర్ధంతి సందర్భంగా సోమవారం బైక్ ర్యాలీ, సభ నిర్వహించారు. ప్రజా సంఘాల కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణ మార్కెట్ ప్రాంతం గుండా అంబేద్కర్ చౌరస్తా వరకు సాగింది. అనంతరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ చౌరస్తాలో భగత్ సింగ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్ మాట్లాడుతూ దేశానికి బ్రిటీష్ పాలన నుంచి స్వాతంత్ర్యం సాధించడం మాత్రమే కాకుండా రైతులు, కార్మికులు శ్రమదోపిడీ లేని సమాజంలో జీవించేలా పోరాడాలనే లక్ష్యంతో భగత్ సింగ్ ఉద్యమం సాగించాడన్నారు. సామాజిక సమానత్వం కోసం సోషలిజమే మార్గమని ఆయన విశ్వసించాడని పేర్కొన్నారు. జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్ కీలక పాత్ర పోషించాడని, "ఇంక్విలాబ్ జిందాబాద్" అనే నినాదంతో యువతలో పోరాట స్ఫూర్తిని నింపాడన్నారు. చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులు రాజ్ గురు, సుఖ్ దేవ్‌లను స్మరించుకున్నారు. యువత భగత్ సింగ్ ఆశయాలను అధ్యయనం చేసి ఆయన రచనలను చదవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్ కుమార్, రాజేందర్, తికానంద్, మాల శ్రీరాజ్ కుమార్, తిరుపతి, మనోహర్, శ్రీకాంత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

**కడెం, మార్చి 23 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లా కడెం మండలంలో మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సారంగాపూర్ గ్రామానికి చెందిన రాకేష్ (27) బైక్ కొనివ్వాలని తల్లిదండ్రులను కోరగా, పంట డబ్బులు వచ్చాక కొనిస్తామని తండ్రి చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన రాకేష్ ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి, రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జన్నారం, మార్చి 23 (ప్రభాత సమాచారం)
వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణపై, మండల కేంద్రంలోని బాలాజీ హాస్పిటల్ లోని డాక్టర్లకు సిబ్బందికి అవగాహన కల్పించినట్టు మండల ప్రభుత్వ, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో ఉన్న అగ్ని మాపక నివారణ యంత్రాలను వాటి ఉపయోగాన్ని, ఎలా ఉపయోగించాలో సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సతీష్, వినోద్, ప్రశాంత్, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

నేరడిగొండ, మార్చి 23 (ప్రభాత సమాచారం)
మండల కేంద్రంలోని ఆదివారం రాత్రి దొంగలు తాళం పగలగొట్టి డబ్బులు బంగారం చోరీ చేసిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే షేక్ సల్మాన్ తండ్రి పేరు షేక్ చాంద్ పాషా, ఆదివారం రోజున వారి అత్తగారిల్లు అయిన బోథ్ కి పండగ సందర్భంగా వెళ్లారు. తెల్లవారుజామున నేరడిగొండలోని ఇంటికి రాగానే ఇల్లు తాళం పగలగొట్టి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరు వాలోని బట్టలు బెడ్ పైన చిందరవందరగా పడి వేసి ఉండడంతో వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం అందించగా, ఏఎస్ఐ షేక్ సల్మాన్ వల్ల ఇంటికి చేరుకొని ఇంటి పరిసరాలను పరిశీలించి, కుటుంబీకులను విచారించ గా, బోథ్ కి వెళ్ళామని తెల్లవారుజామున వచ్చి చూడగా. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా అన్ని చిందరవందరగా పడి ఉన్నాయని బీరువాలో ఉన్న 56000 నగదు రెండున్నర తులాల బంగారం పోయినట్టు కుటుంబీకులు ఏఎస్ఐ కి తెలిపారు.

## నేడు జైనూర్‌లో వారపు సంతల వేలం పాట

జైనూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే తై బజార్, పశువుల సంతలను ఈ నెల 24న వేలంపాట వేస్తున్నట్లు జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, గ్రామ పంచాయతీ ఇంచార్జ్ ఈవో ఆనందరావ్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు తై బజార్‌కు ఒక్కొక్కరు రూ.50 వేలు, పశువుల సంత వేలం పాటలో పాల్గొనే వారు రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించి, నిబంధనల ప్రకారం వేలం పాటలో పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు.

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

ముథోల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)
అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన సంఘటన లోకేశ్వరం మండలంలో జరిగింది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం పోట్ పెల్లి (ఎం) గ్రామానికి చెందిన కదం లిఖిత (33) ఆదివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో పెళ్లి చేసుకోకుండా తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి



**ఆదివాసీ యువతి హత్యపై కలెక్టరేట్ ఎదుట నిరసన**

ఆసిఫాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)
పెంచికల్‌పేట్ మండలం కొండపెల్లి గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి ఆత్రం సమ్మక్క హత్య ఘటనపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కు ల సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో జిల్లాలో ఆదివాసీ మహిళలపై కులోన్మాద దాడులు, హత్యలు, అత్యాచారాలు, అక్రమ రవాణా వంటి నేరాలు పెరుగుతున్నాయని ఈ పరిస్థితుల్లో ఆదివాసీ సమాజం భయాందోళనకు గురవుతోందని పేర్కొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నితిక పంత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రం సమ్మక్క కుటుంబ సభ్యులు, తుడుందెబ్బ నాయకులు బుర్స పోచయ్య, గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తలండి మధుకర్, కొలావార్ సేవా సంఘం అధ్యక్షుడు పిట్టల రామ స్వామి, తెలంగాణ జన సమితి నాయకుడు నిరటి రాజన్న, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్, కెవిపిఎ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు త్రివేణి, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కొరంగ మాల, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే. రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్భయంగా ఫిర్యాదు చేయాలి : ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)
జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను విని, చట్టప్రకారం త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మొత్తం 13 ఫిర్యాదులు స్వీకరించగా వాటి పరిష్కారానికి సంబంధిత డీఎస్పీ, ఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్లతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన మార్గ నిర్దేశం చేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం



ద్వారా ప్రజా సమస్యలను స్వీకరించి పరిష్కరించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని తెలిపారు.

# సైబర్ కేటుగాళ్ల పంజా.. రైతు ఖాతా ఖాళీ

**లింక్ క్లిక్ చేస్తే నిలువుదోపిడీ - క్షణాల్లో రూ.61 వేలు స్వాహా**

వాంకిడి, మార్చి 23 (ప్రభాత సమాచారం)
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సైబర్ మోసాలు రోజు రోజుకు పెరుగు తున్నాయి. వాంకిడి మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన పంద్రం చంద్రు అనే రైతు సైబర్ మోసానికి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం కిందట ఓ వాట్సాప్ గ్రూప్‌లో ఎస్బీఐ బ్యాంకు పేరుతో వచ్చిన లింక్ ను సదరు రైతు క్లిక్ చేయడంతో తన బ్యాంకు ఎకౌంట్ ఖాతాలో జామ ఉన్న 61 వేలు స్వాహా అయ్యాయి. దీంతో బాధిత రైతు బ్యాంకు వెళ్లి విచారి చగా సైబర్ మోసానికి గురైనట్టు గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



**ఐటీడీఏ పీఓ యువరాజ్ మార్మట్**

ఉట్నూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)
ప్రతీ సోమవారం ఉట్నూర్ లోని ఐటీడీఏలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌లో అందించే అర్జీలను పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్ అన్నారు. సోమవారం ఐటీడీఏలోని పీఓ ఛాంబర్‌లో పీఓ గ్రీవెన్స్ సెల్‌లో భాగంగా గిరిజనులు నుండి అర్జీలు స్వీకరించారు. గిరిజనులతో మాట్లాడారు. సమస్యలపై ఓపిగ్గా విన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఓ భరోసానిచ్చారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజనులు అందించే దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని పీఓ ఆదేశించారు. ఉట్నూర్ మండలం ఉమ్రి సాలెగూడ గ్రామానికి చెందిన టెకం భీంరావ్ తమ గ్రామానికి రోడ్డు మంజూరు కల్పించాలని, బజారహత్నూర్ మండలం భూతాయి గ్రామానికి చెందిన మాడవి జైతు తమ గ్రామానికి మహిళ సంఘ భవనం మంజూరు కొరకు అర్జీలో కోరారు. సిరికొండ మండలం సుంకిడి గ్రామానికి చెందిన కుంరం మధుకర్ తనకి ఏదైనా గిరిజన ఆశ్రమ పాఠశాలలో వంట పండే పని కల్పించాలని వేరు వేరుగా అర్జీలు ఓ కి అందజేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంకోలి గ్రామంలో మెగా రక్తదాన శిబిరం

ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)
యువత రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో మెగా రక్తదాన శి బిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు దాదాపు 35 మంది రక్తదానం చేశారు. వీరిని ముఖ్య అ తిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడావి కిషన్, ఉపసర్పంచ్ దండ్ల దత్తు,గ్రామ పటేల్ పెడకాపు, మెడికల్ ఆఫీసర్ దీపిక, సెక్రెటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



## మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేయండి

ఆసిఫాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)
మిల్లింగ్ ప్రక్రియ వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ కె హరిత మిల్లర్లను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రైస్‌మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యాన్ని సమయానికి మిల్లింగ్ చేసి నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం సేకరణ అనంతరం మిల్లింగ్ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిర్దిష్ట గడువుల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడవద్దని స్పష్టం చేశారు. మిల్లింగ్ ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా అమలుచేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు, రైస్ మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.

**నెలాఖరులోగా మూత్రశాలల నిర్మించాలి...**

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన మూత్రశాలల నిర్మాణాలు ఈ నెల 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోలు, టీఏలు, సెర్ప్ ఏపీఎంలతో ఉపాధి హామీ పథకం, స్త్రీనిధి రుణాలు, బ్యాంకు రుణాల అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1,084 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూత్రశాలల నిర్మాణ పనులు ఈ నెల 31 లోగా పూర్తి చేయాలని, ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఇంకా పనులు ప్రారంభం కాని చోట ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల సమాఖ్య భవనాలు, గ్రామసమాఖ్య భవనాల నిర్మాణాలపై అధికారులు పర్యవేక్షించి నాణ్యత ప్రమాణాలు చేపట్టే విధంగా కాంట్రాక్టర్లు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో కూలీల హాజరుకాని చోట వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పనిప్రదేశాల్లో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ సౌకర్యాలు ఉండేలా చూడాలని ఆదేశించారు.

# కేసులకు భయపడం.. ప్రజల పక్షాన నిలబడుతాం

**రెండు రోజుల్లో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభించకపోతే మేమే గుంతను పూడ్చేస్తాం**
**మాజీ మంత్రి జోగురామన్న**



**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)** తమపై ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదని ప్రజల పక్షాన నిలబడతామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి తాంసి బస్టాండ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి పనుల కోసం గుంతను తవ్వి వదిలేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రెండు రోజుల్లో పనులను పున:ప్రారంభించాలని, లేకపోతే ప్రజల రాకపోకలకు సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తామే ట్రాక్టర్లలో మట్టిని తీసుకువచ్చి గుంత ను పూడ్చి ప్రజల రాకపోకల సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడటంతో బీఆర్ఎస్ తరఫున సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి తవ్విన గుంత ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు రామన్న మాట్లాడుతూ... భూ సేకరణ చట్టాన్ని అతిక్రమిస్తూ ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రజలను పక్కదో పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఫిబ్రవరి 13న ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి కేవలం ఎలక్షన్ల కోసమే రైల్వే అండర్ బ్రిడ్జి అంటూ గుంతలు తోడే రాజకీయం చేశారని ఆరోపించారు. తక్షణం కలెక్టర్ చొరవ తీసుకొని గుంతలను పూడ్చి రాకపోకలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాసం నర్సింగ్ రావు, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యూనుస్ అక్బాని, సాజిదోద్దీన్, వెనగంటి ప్రకాష్, వెంకటేష్, దమ్మ పాల్, కొండ గణేష్, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ

**కుభీర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)** మండలంలోని జుమడా గ్రామములో ఈ రోజు ఉపాధి హామీ నిధుల కింద 20 లక్షల నిధులు మంజూరు కావడంతో గ్రామపంచాయతీ భవనానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బషీర్ స్థానిక సర్పంచ్ అగ్గు మారుతి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని గ్రామాల అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు ఎంతో కృషి చేయడం జరుగుతుందని వారు చూపించారు. అదేవిధంగా మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ మళ్లీ రెండో విడతలు మరిన్ని ఇందిరమ్మ పథకాలు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని అన్నారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎకరానికి 6000 చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు. మిగతా 45 రోజుల్లో పూర్తిస్థాయిలో రైతు భరోసా నిధులు చేయడం జరుగుతుందని. వారు సూచించారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూ దాత గోవింద్ సింగ్ గ్రామస్తులు మండల నాయకులు శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బంక బాబు శివాజీ. ఉప సర్పంచ్ శాంతాబాయి గ్రామస్తులు గౌతమ్ భగవాన్ గులాబ్ జీవన్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)** ఇందిరమ్మ ఇండ్లను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనుమతులు లభించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వెంట వెంటనే పూర్తి చేస్తూ ఉండాలని పేర్కొన్నారు. చివరిదశ పనులు మిగిలి ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేసి, గృహ ప్రవేశాలు చేపట్టాలని అన్నారు. వారం వారిగా ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు గృహ ప్రవేశాలు పూర్తి చేసిన ఇండ్ల వివరాలు, ఆయా దశల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల వివరాలు అధికారుల ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, హౌసింగ్ పిడి రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బాధితులకు అండగా పోలీసులు

**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)** సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన 28 ఫిర్యాదుదారులు స్వయంగా జిల్లా ఎస్పీకి నేరుగా తమ సమస్యలను విన్నవించుకొని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి సమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజలు సమస్యలపై లేదా అసాంఘిక కార్యకలాపాల సమాచారాలపై జిల్లా ఎస్పీ నేరుగా నిర్వహించబడుతున్న 8712659973 నెంబర్ కి వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు. సమస్యలలో ఎక్కువ శాతం కుటుంబ సమస్యలు భార్యాభర్తల సమస్యలు భూ పరిష్కారాలు మోసాలు, కేసుల పురోగతిలు ప్రస్తుత స్థితిగతులపై ఫిర్యాదులు అందడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిసి కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బీసీల రాజ్యాధికారం సాధించి తీరుతాం

**టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ**

**మంచిర్యాల, మార్చి 23 (ప్రభాత సమాచారం)** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు టీఆర్పీ నాయకులు పట్టణంలోని ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి, ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్పీ జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చి, రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ హామీలను అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించి ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు సహకరించిన అధికారులపై విచారణ చేపట్టి, వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పుట్ట లావణ్య, జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, వేముల అశోక్, టీఆర్పీ జిల్లా నాయకులు పడాల శివతేజ, దాసృపు దీపక్, ఎండి లతీఫ్, సీపతి సాయి కుమార్, భీమిని రమేష్, బూర రవీందర్, దొబ్బల శంకర్, గనవేని నగేష్, బొంగోని విద్యాసాగర్, అడిచెర్ల రూపాదేవి, రమేష్, మహేందర్ పాల్గొన్నారు.

## చదువుతోపాటు ఆటలూ ముఖ్యమే

**జన్నారం, మార్చి 23 (ప్రభాత సమాచారం)** విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమేనని, ప్రతిరోజూ సాయంత్రం పూట ఆటలు ఆడుకోవాలని, తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్, షమీం అక్తర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ హైస్కూల్ ను, ప్రభుత్వాసుపత్రిని మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించి విద్య సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆ విద్యార్థుల స్థితిగతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా... అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.




## పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

**కుమ్రంభీం జిల్లా కలెక్టర్ కె.హరిత**



**కాగజ్‌నగర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)** పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులకు సూచించారు. సోమవారం కాగజ్‌నగర్ మండలం ఈజ్గాం గ్రామంలోని శాంతినికేతన్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కూర్చునే సౌకర్యం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక వసతులను పరిశీలించారు. పరీక్షల సమయంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని ఇన్విజిలేటర్లకు ఆదేశించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ప్రోత్సహించారు. అనంతరం జంబుగా పెద్దబండ మధ్య రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించి అప్రోచ్ రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## సుద్ద వాగులో పడి ఒక్కరు మృతి

**కుభీర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)** మండలంలోని నిగ్వ గ్రామ సమీపంలోని గాడ్డెన్న వాగులో పడి సోమవారం మృతి చెందారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర లోని కొల్లం జాదవ్ మోహన్ 45 అనే వ్యక్తి నిగ్వ గ్రామానికి వ్యవసాయ పనుల కొరకు ఇటీవల కుటుంబ సభ్యులతో వలస వచ్చి నివసిస్తున్నారుఈ క్రమంలో ఆదివారం ఉదయం వ్యవసాయ క్షేత్రలకు గేదెలు మేత మేపడానికి తీసుకువెళ్లారు. సాయంత్రం అయినప్పటికీ ఇంటికి రాకపోవడం తో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వెతకగా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఉదయం గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లి వెతకగా వాగు వద్ద మోహన్ వేసుకున్న దుస్తులు కనిపించడంతో అనుమానంతో వాగులో వెతికించారు. మోహన్ మృతదేహం లభించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.



## మధ్యాహ్న భోజనంలో
# పురుగులు, రాళ్లు

**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ మండలంలోని కద్తాల్ జెడ్‌పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం అన్నంలో పురుగులు కనిపించాయి. విద్యార్థులు భోజనం చేస్తుండగా ఓ విద్యార్థికి పురుగు కనిపించడంతో ఈ విషయాన్ని సర్పంచ్‌కు తెలిపారు. అక్కడ చేరుకున్న సర్పంచ్ వార్డు సభ్యులు మధ్యాహ్న భోజనం పరిశీలించగా పురుగులు రావడం వారు అక్కడే భోంచేస్తుండగా అన్నంలో చిన్న చిన్న రాళ్లు వచ్చాయి. వెంటనే డిఈఓ కు సమాచారం ఇవ్వగా దర్శనం భోజన అక్కడికి చేరుకొని విచారణ జరిపారు. పలుమార్లు విద్యార్థులు ఫిర్యాదు చేసినప్పటికీ ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడం వలన ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు.

## రాజంపేటలో పారిశుధ్య పనులు

**ఆసిఫాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

రాజంపేట గ్రామపంచాయతీలో పరిశుభ్రత కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని నాలీలు (డ్రైనేజీలు) శుభ్రపరిచే పనులను సర్పంచ్ బుర్స పోచయ్య వార్డు సభ్యుడు గులాం జావిద్ తో కలిసి పరిశీలించారు. గ్రామంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాలీలను పూర్తిగా శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని ప్రతి వీధిలో పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాన్ని శుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



## వీర్థండీ గ్రామంలో
# సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**సిర్పూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

కొమరంభీం జిల్లా సిర్పూర్ మండలం వీర్థండీ గ్రామంలో మందీర్ నుండి పర్చకే సుధాకర్ ఇంటివరకు నిర్మించిన నూతన రోడ్డును సర్పంచ్ పర్చకే ననిత, ఉప సర్పంచ్ పెందోర్ కాళిదాస్, వాడ్ మెంబెర్స్, గ్రామ పెద్దలు, మాజీ ఉప సర్పంచ్, మరియు ఇతర గ్రామస్తులు కలిసి ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం గ్రామ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా తెలిపారు.



# కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీల కోసం పొందుపరిచిన అంశాలు ఈ బడ్జెట్ సమావేశాల్లో అమలు చేసేలా ప్రకటన చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత డిమాండ్ చేశారు. సోమవారం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. పోలీసులు వారిని సముదాయించడంతో గేటు ఎదుట నిరసన తెలిపారు. అనంతరం లోనికి వేళ్లేందుకు యత్నించగా టూ టౌన్ సీఐ నాగరాజు వారిని నిలువరించడంతో కొంత ఉద్రికత్త నెలకొన్నది. అనంతరం పది మందిని లోనికి అనుమతించడంతో వారు లోనికి వేళ్లి కలెక్టర్‌కు సమస్యలపై వినతిప్రతం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు అశన్న, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు



సుజాత, సునీత, ముక్త, కవిత, స్వర్ణలత పాల్గొన్నారు.

**అంగన్‌వాడీల ఆందోళన....**

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు వేతనాలు పెంచాలని కోరుతూ సోమావారం నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షులు లలిత మాట్లాడుతూ.. సిబ్బందికి రూ.18 వేలు వేతనం పెంచాలన్నారు. ఈ ఈ కార్యక్రమంలో నాయకులు భాగ్య, వనజ, కవిత, చంద్రకళ, విజయ, రత్నమాల, పెద్దమ్మ పాల్గొన్నారు.

# వాలిడిషన్ యాక్ట్ రద్దు కోసం 25న నిరసన



**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

దేశంలో ఉన్న మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన వాలిడేషన్ యాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న అన్ని జిల్లాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ పెన్షనర్ల కార్యవర్గ సభ్యుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంసి లింగన్న తెలిపారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 25న అన్ని జిల్లాల్లో పెన్షనర్లు నిరసన పెన్షనర్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నల్లబెడ్లు ధరించి నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వము ప్రవేశపెట్టినటువంటి ఆర్థిక సంస్కరణ చేసినటువంటి వాలిడేషన్ యాక్ట్ దేశంలోని రాష్ట్ర, కేంద్ర పెన్షనర్ల అస్తిత్వానికి ముప్పు పొంచి ఉందన్నారు. గొడ్డలి పెట్టు చర్య, ఇట్టి చర్య వలన దేశంలోని దాదాపు 92 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు అదేవిధంగా లక్షలాదిమంది కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు ఈ ఆక్ట్ ద్వారం నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొౌజ్జ జనార్ధన్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎల్.గంగన్న, జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి యూనిట్ బాధ్యులు కే రమేష్ పి జనార్ధన్ కే బాలకృష్ణ కే శేషాద్రి కమలాకర్ జిల్లా బాధ్యులు కే పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు జవాబుదారీ తనంతో పని చేయాలి

### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా - దండేపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ

**దండేపల్లి, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

పోలీసులు ప్రజలకు జవా బుదారి తనంతో పని చేయాలని, పోలీసుల పట్ల భరోసా కలిగించేలా బాధితులకు అండగా నిలువాలని రామగుండం పోలీసు కమిష నర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. ఆదివారంరాత్రి దండేపల్లి పోలీ సుస్టేషన్‌ను కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి సీపీ ఆకస్మీకంగా తనిఖీ చేపట్టారు. రికార్డులు, రిసెప్షన్, కంప్యూటర్‌లో కేసుల ఆన్‌లైన్ నమోదు తీరును నేరుగా పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్ష ణమే స్పందించాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండాలని, అ సాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహ రించాలన్నారు. పోలీసు పట్ల ప్రజలకు సమ్మకం కలిగించే విధంగా పోలీసులు నిజాయితీగా పని చేయాలన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాలు తనిఖీలు



నిర్వహించాలన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీయడంతో పాటు నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎస్సై తహసీనోద్దీన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు మండల పరిదిలోని అన్ని గ్రామాలలో పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ చేపట్టి ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీపి వెంట సీఐ రమణమూర్తి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# ఆత్రం సమ్మక్క హత్య కేసు నిందితులను శిక్షించాలి

**ఉట్నూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

అమాయక ఆదివాసీ యువతి ఆత్రం సమ్మక్కను ప్రేమ పేరుతో మోసం చేసి దారుణంగా హత్య చేసిన నిందితులను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిదాం జంగుదేవ్ పటేల్, తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు జాడి వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని కేబీ కాంప్లెక్స్ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వద్ద విద్యార్థులతో కలసి వారు మాట్లాడారు. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికల్ పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన అమాయక ఆదివాసీ యువతి ఆత్రం సమ్మక్క ను ప్రేమ పేరుతో మోసం చేసి దారుణంగా హత్య చేసిన ఘటనను విద్యార్థి సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు. వారి వెంట విద్యార్థి నాయకులు మాడవి నితీన్, కళ్లె కుమార్, చిక్రం హను మంతరావు, మెస్రం హిరమన్,అర్రం శివ, జాటోత్ పవన్, చవాన్ విక్రమ్, ఉర్వేత రమేష్, తదితరాల పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఖానాపూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఐక్యంగా ముందుకు వెళ్దామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి జునైద్ మెమన్, జిల్లా కార్యదర్శి ఖిజర్ ఎమ్మెల్యేలను కలిసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమాండ్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ ఖానాపూర్ రాజురా సత్యం, మైనార్టీ పట్టణ అధ్యక్షులు నిర్మల్ మతిన్, మండల అధ్యక్షులు దయానంద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఖానాపూర్ షబ్బీర్ పాషా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అటవీ అధికారిని కలిసిన
# డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

**ఆసిఫాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ జిల్లా అటవీ అధికారిని కలిసి పలు ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను అటవీ ప్రాంత వాగుల నుంచి సేకరించేందుకు సడలింపులు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీలకు అటవీ ఉత్పత్తుల సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలని, పోడు భూములపై అటవీ హక్కు పత్రాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, మారుమూల గిరిజన గూడాలకు రహదారి సదుపాయాల కోసం అటవీ శాఖ సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.





# ముంబై స్లమ్స్‌లో రౌడీ విశ్వరూపం..

టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్ రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది.రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటినుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.





తన పేరు చెప్పి కొందరు వ్యక్తులు మైక్రోఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలపై ప్రముఖ సింగర్ మంగ్లీ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆమె ఒక అధికారిక ప్రకటనను విడుదల చేస్తూ, ఆరోపణలను ఖండించారు. మైక్రోఫైనాన్స్ పేరిట అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులతో గానీ, వారి ఫైనాన్స్ వ్యాపారాలతో గానీ తనకు ఎటువంటి సంబంధం లేదని మంగ్లీ స్పష్టం చేశారు. తన వృత్తిపరమైన కార్యక్రమాల (Professional Events) కోసం చాలా మంది తనను లేదా తన తమ్ముడిని సంప్రదిస్తుంటారని, అది కేవలం ఆహ్వానాల వరకు మాత్రమే పరిమితమని ఆమె తెలిపారు. అంతకు మించి వారి వ్యక్తిగత వ్యాపార వ్యవహారాలతో తనకు కానీ, తన కుటుంబ సభ్యులకు కానీ ఎలాంటి సంబంధం లేదని వివరించారు.

## దుష్ప్రచారంపై ఆవేదన..

కావాలని కొందరు తన వ్యక్తిగత పేరును, ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీకి సంబంధించిన వీడియోలకు, తమ ఇంటికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పారు. "నా ప్రొఫెషనల్ ఈవెంట్స్ మినహా నాకు ఎలాంటి వ్యాపారాలు లేవు. దయచేసి నా పేరు చెప్పి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే నమ్మవద్దు" అని మంగ్లీ ప్రజలను కోరారు. చివరగా, ఇలాంటి మోసపూరిత విషయాల్లో తనను ఇరికించడం అన్యాయమని పేర్కొన్న మంగ్లీ.. బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను ఈ సందర్భంగా కోరారు.



## మళ్లీ పెళ్లి .. కానీ అప్పుడే!

మెగా డాటర్ నటి నిహారిక కొణిదెల వైవాహిక జీవితం గురించి తెలిసిందే. చైతన్య జొన్నలగడ్డతో వివాహ బంధం ముగిసిన తర్వాత? నిహారిక పూర్తి దృష్టిని కెరీర్‌పై మళ్లించి నిర్మాతగా బిజీ అయింది. వెబ్ సిరీస్ నిర్మాణంతో పాటు సినిమాలను యాక్టివ్ గా ప్రొడ్యూస్ చేస్తుంది. యధావిధిగా బుల్లి తెర ఎంటర్ టైన్ మెంట్ షోల్లోనూ పాల్గొంటుంది. అయితే నిహారిక రెండవ పెళ్లి నెట్టింట చర్చ అంతే కామన్ గా మారింది. ఈ నేపథ్యంలో తాజాగా పెళ్లి గురించి వస్తోన్న వార్తలపై స్పందించింది. `భవిష్యత్తులో మళ్లీ పెళ్లి ఖచ్చితంగా చేసుకుంటాను. కానీ అప్పుడే కాదు` అని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి తన ప్రాధాన్యత కేవలం సినిమా నిర్మాణం నటనపైనే ఉందని నిహారిక తెలిపారు. `ప్రతి ఒక్కరూ పెళ్లి అనేది జీవితాంతం ఉండాలని కోరుకుంటారు. కానీ కొన్నిసార్లు పరిస్థితులు మనం ఊహించినట్లు ఉండవని` తన గత అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. ఒక రిలేషన్‌షిప్ వర్కౌట్ కాకపోవడానికి అనేక కారణాలు ఉంటాయని, ప్రస్తుతానికి తాను ఆ చాప్టర్ నుంచి బయటపడి కెరీర్ గ్రాఫ్‌ను పెంచుకునే పనిలో ఉన్నానని పేర్కొన్నారు. `పిల్లలను కనాలనే కోరిక తనకు ఉందని, దాని కోసం పెళ్లి అనేది తప్పనిసరి అని సరదాగా వ్యాఖ్యానించారు. అయితే ఆ సమయం ఎప్పుడు వస్తుందనేది ఇప్పుడే చెప్పలేనని కాలమే అన్ని నిర్ణయిస్తుంది` అని ఆసక్తికర సమాధానమిచ్చారు. సరైన వ్యక్తి దొరికినప్పుడు ఖచ్చితంగా మళ్ళీ వైవాహిక బంధంలోకి అడుగుపెడతానని హింట్ ఇచ్చారు. అలాగే ఇంట్లో తన నిర్ణయాలకు తండ్రి నాగబాబు, అన్నయ్య వరుణ్ తేజ్ పూర్తి మద్దతు ఇస్తారని నిహారిక చెప్పకొచ్చారు. అన్నయ్య వరుణ్ తేజ్, వదిన లావణ్య త్రిపాఠిల వివాహ బంధాన్ని చూస్తుంటే సంతోషంగా ఉంటుందన్నారు. తన విషయంలో కూడా అంతా మంచే జరుగుతుందని ఆమె నమ్మకం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను తాను పెద్దగా పట్టించుకోనని, తన వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవిస్తానని ధీటుగా సమాధానమిచ్చారు. నిర్మాతగా `కమిటీ కుర్రోళ్లు` చిత్రంతో నిహారిక మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం `రాకాస` అనే హారర్ కామెడీ సినిమాతో ఏప్రిల్ లో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్ర ప్రమోషన్లలో భాగంగా ఆమె తన మనసులోని మాటను బయటపెట్టడం మెగా అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. కెరీర్ పరంగా సక్సెస్ అవుతున్న నిహారిక, వ్యక్తిగత జీవితంలో కూడా త్వరలోనే స్థిరపడాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

## ట్రోల్స్‌పై శ్రీలీల ఉగ్రరూపం

టాలీవుడ్ సెన్సేషనల్ డాన్సింగ్ క్వీన్ శ్రీలీల ప్రస్తుతం కెరీర్ పరంగా అదృష్టం కలిసి రావడం లేదు. వరుస సినిమాల్లో నటిస్తున్నప్పటికీ, ఆమెకు ఆశించిన స్థాయిలో సక్సెస్ లభించడం లేదు. తాజాగా పవన్ కళ్యాణ్ సరసన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో సోషల్ మీడియాలో నెటిజన్లు శ్రీలీలను టార్గెట్ చేసి దారుణంగా ట్రోల్ చేస్తున్నారు. తనపై వస్తున్న ఈ విమర్శలు, నెగిటివిటీపై శ్రీలీల తాజాగా తనదైన శైలిలో స్పందించారు. గతంలో ఇలాంటి విషయాలు తనను ఎంతలా బాధించాయో వివరిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సినిమా ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో ఈ ట్రోలింగ్ చూసి చాలా బాధపడేదాన్ని, ఒక్కోసారి తట్టుకోలేక చాలా ఏడ్చేదాన్ని కూడా.అసలు ఇండస్ట్రీలో నేను కొనసాగగలనా? నా వల్ల అవుతుందా ? అనే అనుమానంతో ఇక్కడి నుంచి వెళ్లిపోదామని కూడా అనుకున్నాను. అప్పుడు నేను చాలా సున్నిత మనస్కురాలిని" అని ఆమె తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. అయితే ఇప్పుడు తను చాలా మారిపోయానని, ఇలాంటి విమర్శలను ఎదుర్కొనే ధైర్యం వచ్చిందని ఆమె చెప్పకొచ్చారు. "సోషల్ మీడియాలో ఏదైనా నెగిటివిటీ చూసినప్పుడు, అది ఫేక్ అని తెలుసుకునే వారు కూడా ఉన్నారు. కానీ నిరంతరం నెగిటివిటీని చూస్తూ ఉంటే, అది తెలియకుండానే మన సొంత ఆలోచనలను, మన వ్యక్తిత్వాన్ని కూడా మార్చేస్తుంది. అందుకే ఇప్పుడు నేను వాటిని పట్టించుకోవడం తగ్గించాను" అని శ్రీలీల స్పష్టం చేశారు. వరుస పరాజయాలు ఎదురవుతున్నా, తన నటన, డాన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్న ఈ బ్యూటీ, త్వరలోనే ఒక భారీ హిట్‌తో మళ్ళీ ఫామ్‌లోకి రావాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు.

# ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం




- మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్
- మంచిర్యాల జిల్లా జన్నారంలో గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ
- విద్యార్థులతో ముఖాముఖి.. బోధనా తీరు ఆరా
- వైద్యులు సమయపాలన పాటించాలి..
- రోగులకు మెరుగైన సేవలు అందించాలి
- వెదురు ఉత్పత్తుల కేంద్రం సందర్శన..
- అటవీ వనరులతో ఉపాధి కల్పనపై ఆశాభావం
- పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి..
- ఉపాధ్యాయులకు చైర్‌పర్సన్ దిశానిర్దేశం.
- కోతులు, కుక్కల బెడద, తాగునీటి సమస్యలపై కమిషన్‌కు గ్రామస్తుల వినతి పత్రాల వెల్లువ...

**జన్నారం, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

ఆదివాసి గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. సోమవారం జిల్లాలోని జన్నారం మండల పరిధిలో ఆదివాసీ గిరిజనులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్య, వైద్య సేవలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు అంశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి కల్పిస్తున్న సదుపాయాలు, తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడ ముఖ్యమే అని, విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని తెలిపారు. ప్రతి రోజు పాఠశాలలో క్రీడలు ఒక భాగంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యా బోధన తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను సబ్జెక్టుల లో ప్రశ్నలు అడిగి వారి అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలలో 10వ తరగతి వార్షిక పరీక్షలలో విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలోని రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వారి ఆరోగ్య స్థితిగతులు, ఇతర వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలోపేతం దిశగా అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. కవ్వాల్ వెదురు ఉత్పత్తులు, శిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణ కేంద్రంలో తయారు చేసిన రకరకాల వెదురు ఉత్పత్తులను పరిశీలించారు. అడవిలో లభించే వనరులను వినియోగించుకుని వెదురు ఉత్పత్తుల ఉత్పాదకతను పెంపొందించి అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. జన్నారం మండలంలోని ఆదివాసి గిరిజనులు అడవిలో దొరికే వెదురు, తునికాకు, ఇప్పపువ్వు తదితర వాటిపై ఆధారపడి జీవిస్తున్నారని, జీవనోపాధిని కల్పిస్తూ వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జన్నారం పరిధిలో నెలకొన్న పలు సమస్యలపై ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు, జన్నారం ఆరోగ్య కేంద్రంలో త్రాగు నీరు, వీల్ చైర్, ఇతర సౌకర్యాలపై టిపిసిసి రాష్ట్ర ప్రతినిధి, జన్నారం మండలంలో కోతుల బెడదను తొలగించాలని, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ జన్నారం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు వినతి పత్రాలు అందజేశారు. జన్నారం మండల కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ ను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సబ్బండ కులాల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస రావు, మంచిర్యాల డి.టి.డి.ఓ. రమాదేవి, ఏటీడీఓ సురేష్, ఇన్చార్జి తహసిల్దార్ నేరెళ్ల రామ్మోహన్, గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీరాజం, ప్రిన్సిపల్ రామస్వామి, ఉపాధ్యాయులు కాంతారావు, ప్రభుత్వ వైద్యాధికారులు ఉమాశ్రీ, లక్ష్మి, పోలీస్, అటవీ, రెవెన్యూ పోలీసు శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







### అంగన్‌వాడీ కేంద్రాల్లో
## పోషకాహార లోపంపై ఆందోళన

**కెరమెరి, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని గోయగాం, బారేమోడి, అంతపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఢిల్లీ సభ్యులు, యూనిసెఫ్ ప్రతి నిధులు సోమవారం సందర్శించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల ఆరోగ్య స్థితిని మెరుగుపరచేందుకు ఎత్తు, బరువు లెక్కలను ఖచ్చితంగా నమోదు చేయాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి క్షేత్ర సందర్శన వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి, యూనిసెఫ్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గేట్‌లో నిర్మల్ విద్యార్థి ప్రతిభ

**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ మండలంలోని కొత్త పోచంపాడ్ గ్రామానికి చెందిన (శ్రీనగర్) చింతల సంగీత-రవీందర్ దంపతుల కుమారుడు చింతల సంజయ్ ఇటీవల వెల్లడైన ఆల్ ఇండియా గేట్ సివిల్ ఇంజనీరింగ్ ఫలితాల్లో 432 స్కోర్ సాధించి ప్రతిభ కనబరిచాడు. ఈ విజయంతో కుటుంబ సభ్యులు, బంధువులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం శ్రీనగర్‌లోని ఆయన నివాసంలో రవీందర్ మిత్రులు సంజయ్‌ను శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంజయ్ కృషి, పట్టుదల, నియమం విజయానికి కారణమని పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

## ఖమన గ్రామ అభివృద్ధికి నిధుల కోరుతూ ఉప సర్పంచ్ వినతి



**వాంకిడి, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

వాంకిడి మండలం ఖమన గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ ఉప సర్పంచ్ లాహు కుమార్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో రోడ్ల దుస్థితి, తాగునీటి సరఫరాలో అంతరాయం, విద్య, ఆరోగ్య రంగాల్లో సౌకర్యాల కొరత వంటి సమస్యలను ఆయన వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే నిధులు కేటాయించాలని కోరారు. సమస్యలను సానుకూలంగా పరిగణించి, అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చూపిస్తామని ఆత్రం సుగుణక్క హామీ ఇచ్చారు. గ్రామస్తులు ఈ చర్యలను స్వాగతించారు.

## ఇంటర్నేషనల్ రికార్డ్ హోల్డర్ మానస ఘనత



**బెల్లంపల్లి, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

అసాధారణ జ్ఞాపకశక్తితో ఆధ్యాత్మిక రంగంలో సరికొత్త రికార్డు సృష్టించిన మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లికి చెందిన వేముల మానస ప్రతిష్టాత్మకమైన 'పద్మశాలి ఉగాది పురస్కారం' అందుకున్నారు. రామాయణంలోని 2800 శ్లోకాలను కేవలం 150 నిమిషాల వ్యవధిలో అనర్గళంగా పఠించి, 'ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించినందుకు గాను ఆమెకు ఈ గౌరవం లభించింది. హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్ వేదికగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు, మాజీ మంత్రి బాబు మోహన్ చేతుల మీదుగా మానస ఈ పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మరియు రాష్ట్ర పద్మశాలి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించబడింది. వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు ఈ సందర్భంగా 'పద్మశాలి ఉగాది పురస్కారాల'ను అందజేశారు. రామాయణం వంటి బృహత్ కావ్యాన్ని అతి తక్కువ సమయంలో పఠించడం సామాన్యమైన విషయం కాదని, మానస కనబరిచిన ఈ ప్రతిభ యువతకు స్ఫూర్తిదాయకమని నిర్వాహకులు కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో రికార్డు సాధించడమే కాకుండా, తెలుగు సంస్కృతిని, ఆధ్యాత్మికతను చాటిచెప్పినందుకు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. తమ పట్టణానికి చెందిన యువతి రాష్ట్ర రాజధానిలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందుకోవడంపై బెల్లంపల్లి పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మానస సాధించిన ఈ విజయంతో బెల్లంపల్లి పేరు మారుమోగిందని స్థానిక ప్రముఖులు, మేధావులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

### సోషల్ మీడియాలో రెచ్చగొట్టే
## పోస్టులు పెడితే కఠిన చర్యలు!

**రాజకీయ విమర్శలు మితిమీరితే జైలు శిక్ష తప్పదు**
**బోథ్ సీఐ డి. గురుస్వామి హెచ్చరిక**
**వాట్సాప్ అడ్మిన్‌లదే పూర్తి బాధ్యత**

**బోథ్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

సోషల్ మీడియా వేదికగా రాజకీయ పార్టీల మధ్య, వివిధ వర్గాల మధ్య చిచ్చు పెట్టేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బోథ్ సీఐ డి. గురుస్వామి హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ, ఇతరులను కించపరిచేలా వ్యవహరిస్తున్న పలువురిపై ఇప్పటికే కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో మితిమీరిన పదజాలంతో రాజకీయ విమర్శలు చేయడం, వ్యక్తుల వ్యక్తిత్వాన్ని హననం చేసేలా పోస్టులు పెట్టడం సైబర్ నేరాల కిందకు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు తమ గ్రూపుల్లో జరిగే చర్చలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. అభ్యంతరకరమైన లేదా రెచ్చగొట్టే పోస్టులను గమనించిన వెంటనే వాటిని రిమూవ్ చేయాలని, అలా చేయకుండా నిర్లక్ష్యం వహించే అడ్మిన్‌లపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. పట్టణంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో ద్వేషపూరిత ప్రచారం చేస్తున్న వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా పెంచినట్లు సీఐ తెలిపారు. అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే సందేశాల వల్ల సమాజంలో గొడవలు జరిగే అవకాశం ఉన్నందున, చట్టాన్ని అతిక్రమించే వారి పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఏవైనా అభ్యంతరకర పోస్టులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



నీటి కోసం వ్యవసాయ బావి వద్ద భగీరథ యత్నం..

రూ.కోట్లు ఖర్చు చేసినా అందని తాగునీరు..

# ‘జల’ఘోష

- ఎండుతున్న పల్లెగొంతు..
- నీటి కోసం మైళ్ల దూరం నడక
- మేజర్ మండలాల్లో మంచినీటి కొరత
- భూమిలోకి కురుకుపోయిన బోర్లు..
- భగభగలకు మోడువారుతున్న అడవులు
- ఎండవేడిమికి తల్లడిల్లుతున్న జనం
- ఊరూరా తీవ్రమైన మంచినీటి ఎద్దటి
- ‘భగీరథ’ నీటి కోసం ఎదురుచూపులు
- చుట్టుముడుతున్న వ్యాధులు..
- చోద్యం చూస్తున్న అధికారయంత్రాంగం

అధికారులూ.. మేల్కోండి..!

“అడవుల జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.. సూర్యప్రతాపానికి అడవుల జిల్లాలో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు.. ఎండల దాటికి అడవులు మోడువారుతున్నాయి. దీంతో వన్యప్రాణులు విలవిలాడుతున్నాయి.. మరో పక్క తడారి పల్లెగొంతులు చుక్కనీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. పాలకులు ఎందరు మారినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. మంచినీటి పథకాల కోసం ఎన్ని కోట్లు వెచ్చించినా సామాన్యుడికి గుక్కెడు నీళ్లు అందడం లేదు. మరో పక్క మండుతున్న ఎండల కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకీ అడుగంటిపోతున్నాయి.. తాగునీటి బోర్లలో నీరు ఇంకిపోతోంది.. ఈ గండం నుంచి ప్రజలను గట్టెక్కించడానికి ప్రభుత్వం రూ.కోట్లు కుమ్మరిస్తోంది... అయినా ఆ నిధులు సద్వినియోగం కాకపోవడంతో సామాన్య జనానికి జలఘోష తప్పడం లేదు.. జనానికి గుక్కెడు మంచినీరు దొరకడం గగనమవుతుంది. ప్రభుత్వం తాగునీటి సరఫరా కోసం వెచ్చిస్తున్న కోట్లాది రూపాయలు సద్వినియోగం కావడం లేదు.. దీంతో సామాన్య ప్రజలు నీటిని కూడా కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.”

-ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి



చెలిమెల నీరే శరణ్యం..

ఏజెన్సీ మారుమూల గ్రామా ల్లో అప్పుడే తాగునీటి తండ్లాట మొదలై ఆదివాసీలు దాహంతో అల్లాడుతున్నారు. ఈ యేడు ఫిబ్రవరిలోనే జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భూగర్భ జలాలు వేగంగా అడు గంటుకుపోతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 38 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం గిరిజనుల ధరికి చేరడం లేదు. ఏజెన్సీలో ఆదివాసీ గిరిజనులకు ఇప్పటికీ వ్యవసాయ బావులే దిక్కవుతున్నాయి. సిరికొండ మండలం మల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నిజాంగూడ గ్రామంలో స్థానికులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సమీప వ్యవసాయ బావుల నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితులే వాయిపేట్, భీంపూర్, సూర్యపేట, కుంట గూడ, పాలవాగు, రాంజీగూడ, చెమ్మన్‌గుడితో పాటు మరెన్నో ఆదివాసీ గూడాల్లో తాగునీటి ఎద్దడి కనిపిస్తుంది. అంతేకాకుండా, ఏజెన్సీలోని బజార్‌హత్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లోని పలు ఆదివాసీ గూడాల్లో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. గిరిజనులు కలుషిత నీటిని తాగి విష జ్వరాల బారీన పడుతున్నారు. ఇప్పటికే గ్రామాల సమీపంలోని వాగులు, కుంటలు అడుగంటడంతో తాగునీటి ఇబ్బందులు మరింత తీవ్రమవుతున్నాయి. మిషన్ భగీరథ పైపులైన్ వేసిన అధికారు లు సక్రమంగా నీటిని సరఫరా చేయడం లేదని ఆదివాసీలు పేర్కొంటున్నారు. చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తే మారుమూల గిరిజన గూడాలకు తాగునీటి ఇబ్బందులను తీర్చే అవకాశం ఉంటుంది. కానీ, అధికారు లు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏజెన్సీలో పరిస్థితి ఇలా ఉంటే అధికారులు ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం గమనార్హం.





**వ్యవసాయ బావులే దిక్కు...**

ప్రతీ ఇంటికి తాగునీటిని సరఫరా చేయాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథతో ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదు. వేసవి ప్రారంభం లోనే నీటి ఎద్దడి తలెత్తడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో ఆది వాసీ గిరిజనులకు వ్యవసాయ బావులే దిక్కవుతున్నాయి. గత్యంతరం లేక అందుబాటులో ఉన్న వ్యవసాయ బావుల నుంచి తాగునీటిని తీసుకొచ్చి దాహం తీర్చుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదకర సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. వేసవిలో ఈ బావుల్లోనూ నీటి నిల్వలు అడుగంటుకుపోవడంతో ఒర్రెలు, వాగుల్లో చెలిమెలు తవ్వి తాగునీటిని తెచ్చుకో వాల్సి వస్తుందని ఆదివాసీలు పేర్కొంటున్నారు. మైదాన ప్రాం తాల్లో కొంత మేరకు మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా.. ఏజెన్సీ మారుమూల గ్రామాల్లోనే సమస్యగా మారింది. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ బావుల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తుంది. నిత్యం కిలోమీటర్ల నడకతో తాగునీటిని తీసుకొచ్చుకుంటున్నారు. ఎడ్లబండిని కలిగి ఉన్నవారు డ్ర మ్ముల్లో నీటిని తెచ్చుకుంటున్నారు. మండుతున్న ఎండల కు వ్యవసాయ బావులు కాస్త ఎండిపోవడంతో స్థానిక ఆదివాసీ గిరిజనులకు తాగునీటి కష్టాలు మరింత తీవ్రమవుతున్నాయి.

**వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు...**

ఏజెన్సీలో గుక్కెడు మంచి నీళ్లయిన దొరక్కపోవడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగుతూ ఆదివాసీలు అనారోగ్య సమస్యల భారిన పడుతున్నారు. ప్రధానంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో మంచం పడుతున్నారు. మెరుగైన వైద్యం కూడా అందకపోవడంతో యేటా పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ముఖ్యంగా ప్రతియేటా వేసవిలోనే నీటి ఇబ్బందుల వల్ల కలుషిత నీటితోనే గొంతు తడుపుకునే పరిస్థితి ఏర్పడుతుంది. దాదాపుగా అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా పైపులైన్ వేసినప్పటికీ.. నీటిని సరఫరా చేయ కపోవడంతో వ్యవసాయ బావులు, బోరుబావులతో దాహం తీర్చుకుంటున్నారు. ఆదివాసీలను చుట్టుముడుతున్న అనారోగ్య సమస్యలకు తాగునీటి సమస్యే ప్రధాన కారణమని ప్రభుత్వం గుర్తించినా.. దిద్దుబాటు చర్యలను చేపట్టడం లేదు. అంతేకాకుండా పలుమార్లు మిషన్ భగీరథ నీరు రావడం లేదని సంబంధిత అధికారులకు తెలిపినా.. ప్ర యోజనమే లేకుండా పోయిందని వాపోతున్నారు. ప్రతీయేటా వర్షాకాల సీజన్ ప్రారంభంలోనూ డయేరియా, టైఫాయిడ్ లాంటి వ్యాధుల బారీన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటు న్న అనారోగ్య సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ కూడా దృష్టి సారించకపోవడంతో ప్రాణాంతక వ్యాధులు చుట్టుముడుతున్నాయి. కనీసం క్లోరినేషన్ చేయ కుండానే కలుషిత నీటిని తాగుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### ముగ్గురి అరెస్ట్, నగదు, మొబైల్ ఫోన్‌లు, బైకులు స్వాధీనం

**కోటపల్లి, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

చెన్నూర్ నియోజకవర్గం కోటపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని సోమవారం కోటపల్లి పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా .. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా, వారిలో ముగ్గురిని పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకోగా నలుగురు పోలీసులను చూసి అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయారు. అరెస్టయిన జనగాం మల్లేష్, మనుమల్ల అనిల్, గోగు నాగరాజుల నుంచి రూ. 4,050 నగదు, నాలుగు మొబైల్స్, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. గోగు రాజేందర్, గోగు సత్తన్న, కుంతి పోషం, మనుమల్ల వినోద్‌లు పరారీలు ఉన్నారు. ఈ మేరకు కోటపల్లి ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. ఈ దాడిలో కోటపల్లి హెడ్ కానిస్టే బుల్ బుజ్జిబాబుతో పాటు టీజీఎస్పీ కానిస్టేబుళ్లు రాంప్రసాద్, సతీష్, సందీప్, రాజ్ కుమార్, నరేష్‌లు పాల్గొన్నారన్నారు.

## హైకోర్టు ఆదేశాలు పాటించరా

**మంచిర్యాల, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ చైర్పర్సన్ ఎన్నికలు ఈ నెల 24 లోపు నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం పాటించడంలేదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. బెయిల్ షరతుల్లో భాగంగా ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరై సంతకం చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేయాలని చూస్తోందని, దీనిపై త్వరలో గవర్నర్‌ను కలుస్తామని తెలిపారు. అసెంబ్లీలో క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్ మున్సిపాలిటీల ఎన్నికల అంశాన్ని లేవనెత్తుతామని పేర్కొన్నారు. అవసరమైతే కోర్టు దిక్కరణ కింద మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. క్యాతనపల్లిలో 14 స్థానాలు బీఆర్ఎస్-సీపీఐ గెలుచుకున్నా ఏడు స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్ అధికార, పోలీస్ బలాన్ని ఉపయోగించి తమపై కేసులు పెట్టిందని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఛైర్‌పర్సన్ స్థానాలు బీఆర్ఎస్, సీపీఐ కూటమివేనని ధీమా వ్యక్తం చేశారు.

## సెల్‌ఫోన్ కోసం గొడవ
## స్నేహితుడి దారుణ హత్య

**మంచిర్యాల, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

సెల్‌ఫోన్ విషయంలో స్నేహితుల మధ్య జరిగిన గొడవ హత్యకు దారితీసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మహారాష్ట్రకు చెందిన దీపక్ (35), భీమిని సంజీవ్, కాసిపేట మండలం సిడం దీపక్‌లు జిల్లా కేంద్రంలోని చిందం శ్రీనివాస్ అనే బిల్డర్ వద్ద కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో దీపక్, సంజీవ్, సిడం దీపక్‌లు రాత్రి మద్యం తాగుతుండగా సెల్‌ఫోన్ విషయంలో గొడవ పడ్డారు. ఈక్రమంలో సంజీవ్, సిడం దీపక్‌లు దీపక్‌ను రాడుతో తలపై మోదీ హత్య చేశారు. నిందితులు సంజీవ్, సిడం దీపక్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చి 14 రోజుల రిమాండ్‌కు తరలిం చినట్లు సీఐ వెల్లడించారు.

# బాసర ట్రిపుల్ ఐటీపై మంత్రి జూపల్లి సీరియస్

- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశం!
- విద్యార్థుల ఆందోళనలు, సెలవుల ప్రకటనపై హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష
- ఆవేశంతో భవిష్యత్తును పాడుచేసుకోవద్దు
- విద్యార్థులకు మంత్రి హితవు
- క్యాంపస్‌లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు
- త్వరలోనే విద్యార్థులతో ముఖాముఖి

**ముథోల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)లో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల నిరసనలు, తదనంతరం సెలవులు ప్రకటించడం, తదితర అంశాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్యాంపస్‌లో ప్రస్తుత స్థితిగతులను, విద్యార్థుల ఆందోళనల వెనుక ఉన్న కారణాలను బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్ మంత్రికి వివరించారు. క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా, ముందస్తు జాగ్రత్తగా సెలవులు ప్రకటించాల్సి వచ్చిందని వీసీ గోవర్ధన్ మంత్రికి తెలిపారు. విద్యార్థుల ప్రధాన డిమాండ్లు, సెలవుల ప్రకటనకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, కేవలం ఆవేశంతో ఆందోళనలు చేస్తూ తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. సమస్యలు ఏవైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. క్యాంపస్‌లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. త్వరలోనే క్యాంపస్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని వీసీని మంత్రి ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ట్రిపుల్ ఐటిని సందర్శించి, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా అధికారులు వెంటనే తక్షణ చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన వర్సిటీ అధికారులను ఆదేశించారు.



# ఐటీడీఏలో 'డిజిటల్' విప్లవం



- ఫిర్యాదుల పరిష్కారానికి 'ఐటీడీఏ పల్స్'
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్

**ఉట్నూర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచే లక్ష్యంతో ఉట్నూరు ఐటీడీఏ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు, వేగంగా పరిష్కరించేందుకు వీలుగా ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేశారు. 'ఐటీడీఏ పల్స్' పేరుతో రూపొందించిన ఈ నూతన ప్లాట్‌ఫామ్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మట్ సోమవారం ప్రారంభించారు. ఇకపై ఐటీడీఏకు వచ్చే ప్రతి ఫిర్యాదు ఈ నూతన వ్యవస్థలోనే నమోదవుతుందని పీవో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి నిరంతర పర్యవేక్షణ అత్యంత కీలకమని, ఈ డిజిటల్ వ్యవస్థ ద్వారా ప్రతి అధికారిని జవాబుదారీగా ఉంచే అవకాశం కలుగుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్థితిగతులను ఉన్నతాధికారులు నేరుగా పర్యవేక్షించవచ్చని, దీనివల్ల విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావుండదని పేర్కొన్నారు.

**క్యూఆర్ కోడ్‌తో ఫిర్యాదు స్థితిగతుల పరిశీలన...**

ఈ వ్యవస్థలో భాగంగా ప్రతి ఫిర్యాదుదారునికి ఒక ఎలక్ట్రానిక్ ఫిర్యాదు కార్డును జారీ చేస్తారు. ఈ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా బాధితులు తమ ఫిర్యాదు ఏ దశలో ఉంది? ఏ అధికారి వద్ద పెండింగ్‌లో ఉంది వంటి వివరాలను నేరుగా తమ మొబైల్ ఫోన్లలోనే తెలుసుకోవచ్చు. దీనివల్ల ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని పీవో వివరించారు.

**త్వరలో వాట్సాప్, ఆన్‌లైన్ పోర్టల్ సేవలు...**

సాంకేతికతను సామాన్యులకు మరింత చేరువ చేస్తూ, త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో వాట్సాప్ ద్వారా కూడా ఫిర్యాదులు చేసే వెసులుబాటు కల్పిస్తామని యువరాజ్ మర్మట్ వెల్లడించారు. అలాగే ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని, తద్వారా ప్రజలు ఎక్కడి నుంచైనా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.





# గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు

**నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**బాసరలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఘాట్లు, రోడ్ల అభివృద్ధి.**
**దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష.**
**పుష్కర ఘాట్ల వద్ద తాగునీరు, పార్కింగ్ వసతులపై ప్రత్యేక దృష్టి**
**సరస్వతి క్షేత్రానికి పెరగనున్న భక్తుల రద్దీ.. ముందస్తు ప్రణాళికలు**

**నిర్మల్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**

గోదావరి నది పుష్కరాలను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం రాత్రి దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంత రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌లు తదితర అధికారులు గోదావరి నది పుష్కరాలు, ప్రత్యేకించి బాసరలో గోదావరి నది పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియోకాన్ఫరెన్సు లో భాగంగా వారు జిల్లాలో గోదావరి నది పుష్కరాలకు సంబంధించి ఏర్పాట్లు, బాసరలో చేపట్టిన పనులకు సంబంధించి వివరాలపై సమీక్షించారు. కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వీసీలో భాగంగా మాట్లాడుతూ, రాబోయే గోదావరి నది పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. ఇదివరకే సంబంధిత అధికారులు అందరితో, పుష్కరాల ఏర్పాట్లపై పలుమార్లు సమావేశం నిర్వహించినట్లు వివరించారు. బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం, పుష్కర ఘాట్ వద్దకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, దానికి తగ్గట్టుగానే ఏర్పాట్లను చేస్తామని చెప్పారు. పుష్కర ఘాట్ ల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఘాట్ ల నిర్మాణం, నీటి వసతి, మరుగుదొడ్లు, పార్కింగ్ తదితర వసతులు కల్పిస్తామని తెలిపారు. బాసర ఆలయానికి చేరుకునే విధంగా రోడ్లను తీర్చిదిద్దుతామని అన్నారు. అవసరమైన నిర్మాణాలు చేపట్టి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# సిరాజ్ ఖాద్రి ఇక లేరు..!

**అనారోగ్యంతో కన్ను మూసిన ఎంఐఎం నేత**

**ఆదిలాబాద్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**



ఎంఐఎం సీనియర్ నాయకుడు, సిరాజ్ ఖాద్రి సోమవారం రాత్రి ఆదిలాబాద్ లోని ఆయన నివాసంలో కన్ను మూసారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. సుదీర్ఘ కాలం పాటు ఆదిలాబాద్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొన్న సిరాజ్ ఖాద్రి జర్నలిస్టు గా జీవి తాన్ని ప్రారంభించి సియాసత్ దింపత్రికలో పని చేసిన ఆయన సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటు ఎంఐఎం పార్టీ లో చేరారు. ఎంఐఎం జిల్లా అధ్యక్షుడిగా పని చేసారు. ప్రస్తుతం ఆయన ఎంఐ ఎంకు పెద్దదిక్కుగా ఉన్నారు. అన్ని వర్గాల ప్రజలతో, రాజకీయ పా ర్టీల నాయకులతో సోదర భావంతో మెలుగుతు ఆదిలాబాద్ పట్టణ ప్రజల అభిమానాన్ని చూరగోన్నారు. అయన మరణ వార్త పట్టణ ప్రజలను కలిచి వేసింది. ఆయన మృతి పట్ల రాజకీయ పక్షాల నాయకులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సంతాపాన్ని ప్రకటించారు. అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం ఆదిలాబాద్ లోని ఈద్గా మైదానంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు

# రూ. 135 కోట్లు కేటాయించాలి

**సిర్పూర్ (టి) ఎమ్మెల్యే పాల్వాయి డిమాండ్**

**కాగజ్‌నగర్, మార్చి 23 (ప్రభాత సమాచారం)**



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం జగన్నాథ్ పూర్ ప్రాజెక్టుకు రూ. 135 కోట్లు కేటాయించాలని సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. కాగజ్ నగర్ జగన్నాథ్ పూర్ గ్రామంలో ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ. 135 కోట్లు అవసరమని, వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.